ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.0
కనిష్ఠం 20.0

ANDHRAJYOTHY



# సూర్యాపేట

5

శుక్రవారం 4 జూలై 2025


| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.5050) | 520.20 (149.6410) | 58,578 | 900 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 641.45 (3.56) | 68.78 | 68.78 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 156.035 (21.215) | నిల్ | 4,000 |

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.124 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

పోషకాహార లోపంతో ఎవరూ అనారోగ్యం పాలు కావొద్దన్న ఉద్దేశంతో అంగన్‌వాడీకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా కడుపులో బిడ్డ పడిన దగ్గరి నుంచి పెరిగి పెద్దయి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకూ బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. చిన్నారులతోపాటు వారి తల్లులకు కూడా నాణ్యమైన ఆహారం ఇస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా ఇక నుంచి ముఖ గుర్తింపు విధానాన్ని తీసుకొస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పడనుంది.

- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)



# అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్



- నకిలీ లబ్ధిదారుల తొలగింపే లక్ష్యంగా ఫేస్ రికగ్నైజేషన్
- పారదర్శక సేవలకు శ్రీకారం

కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు చెక్ పడనుంది.అవకతవకలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలనుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలతోపాటు గర్భిణులు, బాలింత మహిళలకు నెలనెల పౌష్టికాహారం అందించే సమయాల్లో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖం ఆధారిత గుర్తింపు)ను తప్పనిసరి చేసింది. కేంద్రాల్లో నకిలీ లబ్ధిదారులను తొలగించి అర్హులైన వారికి మాత్రమే పౌష్టికాహారం అందించి పారదర్శకత పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఈవిధానాన్ని తీసుకొచ్చిందిదీనికోసం ఇప్పటికే పోషణ్ ట్రాకర్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

**సెల్‌ఫోన్ ద్వారా ఫేస్ క్యాప్చర్**

ఆయా అంగన్‌వాడీకేంద్రాల్లోని లబ్ధిదారులకు సంబంధించిన ఫొటోలు తీసి ఆధార్, కేవైసీ వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. వారికి అందిస్తున్న పోషకాహారం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతీనెల లబ్ధిదారుడు కేంద్రానికి వచ్చిన తర్వాత ముఖ గుర్తింపు హాజరు తీసుకుని ఆహారం పంపిణీచేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ఏ సరుకులు పంపిణీ చేశారో నేరుగా లబ్ధిదారుల సెల్‌ఫోన్‌లకు సమాచారం వెళ్లేలా యాప్‌ను రూపొందించారు. తద్వారా పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టేందుకు అవకాశం ఉంది. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం ముఖం ఆధారిత గుర్తింపు

-మిగతా 6వ పేజీలో...

**పకడ్బందీగా అమలు చేస్తాం: శైలజ, సీడీపీవో**



కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేస్తాం. ఈ మేరకు అన్ని కేంద్రాల్లో ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే 70నుంచి 80శాతం పూర్తి చేశాం. ఆధార్ గుర్తింపులో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేసేలా సిబ్బందికి సూచించాం. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విధానంతో పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు మాత్రమే అందే ఆస్కారం ఉంది.

# గురుకులాల్లో ఫోన్‌మిత్ర

వివిధ సంక్షేమశాఖలకు చెందిన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇంటిమీద బెంగతో కొంతమేర ఇబ్బందులు పడుతుంటారు. మరికొందరు తల్లిదండ్రులతో ఉన్న అనుబంధం కారణంగా వారితో మాట్లాడలేక, వారిని విడిచి ఉండలేక ఇంటిదారి పడుతుంటారు. కొంత మంది కళాశాలల్లో ఒంటరితనాన్ని భరించలేక, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకుని ఫోన్‌మిత్ర కార్యక్రమానికి ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో శ్రీకారం చుట్టారు. దీంతో విద్యార్థుల్లో భయం పోగొట్టడం, ఇంటిపైన బెంగ నుంచి విముక్తి కల్పించనున్నారు. అందుకోసం యాక్సిస్ బ్యాంకుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా, గురుకుల కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రకారం ఫోన్లు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట (కలెక్టరేట్)



సూర్యాపేట బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటుచేసిన ఫోన్ ద్వారా మాట్లాడుతున్న విద్యార్థినులు

- ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు
- ప్రతీ విద్యార్థికి స్మార్ట్‌కార్డ్
- ఫోన్‌మిత్రతో విద్యార్థుల్లో తొలగనున్న ఇంటిబెంగ

ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఫోన్‌మిత్ర పథకాన్ని ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మొదటగా హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి గురుకులంలో ఏర్పాటు చేయగా, సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలోని ఎనిమిది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 'ఫోన్‌మిత్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఒక్కో గురుకుల కళాశాలలో 640 మంది విద్యార్థులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో ఐదు బాలికల, మూడు బాలుర ఎస్సీ గురుకులాలు ఉండగా, ఈ గురుకులాల్లో మొత్తం 5వేల మందికిపైగా విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు.

**స్మార్ట్‌కార్డ్‌లో ముందుగానే ఫోన్ నెంబర్లు**



గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసించే ప్రతీ విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ అందించారు. అందులో ముందుగానే విద్యార్థి తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒకరి ఫోన్ నెంబరుతో పాటు గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి నెంబర్‌ను ముందుగానే ఫీడ్ చేశారు. విద్యార్థులు స్మార్ట్‌కార్డ్ ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం ఉంటుంది. ఫోన్లు చేసినందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. గురుకులాల్లోని ప్రతీ 100మంది విద్యార్థులకు ఒక ఫోన్ చొప్పున ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రతీ రోజు వారికి అవసరం అనుకుంటే సాయంత్రం కళాశాల తరగతులు ముగిసిన అనంతరం 4.30 నుంచి రాత్రి 7గంటల వరకు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసుకునే అవకాశం ఉంది. గతంలో క్లాస్‌టీచర్ (హౌస్ పేరెంట్ టీచర్) ఫోన్ ద్వారా మాత్రమే ఎప్పుడో ఒకసారి అత్యవసరం అనుకుంటే మాత్రమే ఫోన్ సదుపాయం ఉండేది. ఇప్పుడు ప్రతీ రోజు మాట్లాడుకునే అవకాశం కల్పించారు. అదే విధంగా కళాశాలల్లో ఏమైనా సమస్యలు ఉన్నా వెంటనే గురుకులాల రాష్ట్ర కార్యదర్శికి

- మిగతా 6వ పేజీలో...

# ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో పాత్ర కీలకం

- పేర్ల తొలగింపు, మార్పులను విచారించాలి: కలెక్టర్



విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

మోతె, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోల పాత్ర కీలకమైందని, బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. మోతె రైతువేదికలో గురువారం బీఎల్‌వోలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌వోలు ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు, ఓటును మార్చుకునే వారి వివరాలను ఇంటింటికీ వెళ్లి విచారణ చేయాలన్నారు. అనంతరం మామిళ్లగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులు ఏవిధంగా బోధిస్తున్నారనే విషయమై విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చుని విన్నారు. పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విభళాపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించగా పాఠశాల ఆవరణలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. అలాగే పీహెచ్‌సీని సందర్శించి సిబ్బంది వివరాలు, రికార్డులను పరిశీలించారు. గతంలో పరిశీలించిన సమయంలో కేంద్రంలో మట్టిదిబ్బలు, కంకర అపరిశుభ్రతను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో చేపడుతున్న రిజిస్ట్రేషన్, భూరికార్డులు, సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాల్‌తండాలో ఓ రైతు ప్రభుత్వ డొంకను ఆక్రమించుకున్నాడని పదిరోజులుగా తహసీల్దార్ విన్నవించినా పట్టించుకోవడం లేదని మాజీ జడ్పీటీసీ బానోత్ మాతృనాయక్, గ్రామస్తులతో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి**

సూర్యాపేట(కలెక్టరేట్): జిల్లాలో పింఛన్ల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో చేయూత పథకం అమలుపై జిల్లాలోని వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. పింఛన్లకు సంబంధించి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌లో ఉన్న వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. అర్హులకు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో పడీ అప్పారావు, డీఎల్‌పీవో నారాయణరెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జేపీఎం రవి, టీసీఎస్ అధికారి లోకేష్, గోపాలరావు పాల్గొన్నారు.

**వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి**

జిల్లాలో వన మహోత్సవ లక్ష్యాలను ఆయా శాఖలు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవం, ఉపాధి హామీ పనులు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు 59.88లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబరు చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. డీఆర్‌డీఏ శాఖకు 28.87లక్షలు, మునిసిపల్ శాఖ 15వేల 532తో పాటుమొత్తం 18 శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటాలన్నారు. ఎంపీడీవోలు అటవీ ప్రాంతాల్లో హరితవనాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో అప్పారావు, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో శిరీష, డీపీవో యాదయ్య, డీఎల్‌పీవో నారాయణరెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

**టీబీ రహిత దేశం కోసం కృషి చేయాలి**

టీబీ రహిత దేశం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని టీబీ ముక్త్ భారత్ అభియాన్ సెంట్రల్ టీబీ డివిజన్ అధికారి డాక్టర్ వీణ అన్నారు. గురువారం రాత్రి ఢిల్లీ నుంచి కలెక్టర్, వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. టీబీ నివారణ కోసం జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డాక్టర్ నాజియా పాల్గొన్నారు.

# ఆర్టీఏ ఏజెంట్లకు ఏసీబీ దడ

ఆర్టీఏ ఏజెంట్లకు ఏసీబీ దడ పట్టుకుంది. నిన్నమొన్నటి వరకు ఆర్టీఏ, ఎంవీఐ కార్యాలయాల్లో వీరిదే హవా. ఏ ఫైల్‌పై సంతకం కావాలన్నా నేరుగా కాకుండా వీరి ద్వారా వెళితేనే పనిజరిగేది. రోజుల తరబడి తిప్పించుకునే పనులను కూడా ఒక్కరోజులే ఆర్టీఏ ఏజెంట్లు చేసిపెట్టేవారు. అలాంటి పరిస్థితులు కొద్దిరోజులుగా కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలో ఏసీబీ దాడులు చేయడంతో ఆ భయం ఇక్కడి అధికారులకు, ఏజెంట్లకు పట్టుకుంది. దీంతో ఏజెంట్లను అధికారులు కార్యాలయాల్లోకి రానివ్వడంలేదు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



జిల్లాకేంద్రంలో బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు(ఫైల్)

- జిల్లాపై ఏసీబీ దాడుల ప్రభావం
- దుకాణాలు బంద్ చేసిన ఏజెంట్లు
- కార్యాలయాల్లోకి రానివ్వని అధికారులు

రంగారెడ్డి జిల్లాలో ఆర్టీఏ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కార్యాలయంతో పాటు ఆర్టీఏ ఏజెంట్లపై కూడా దాడులు నిర్వహించారు. వారినీ విచారించారు. ఈ విషయం తెలియడంతో సూర్యాపేట పట్టణం గాంధీనగర్‌లో ఉన్న ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఉన్న ఏజెంట్లు దుకాణాలు బంద్ చేశారు. అంతేకాక రవాణాశాఖ అధికారులు కూడా ఏజెంట్లను కార్యాలయంలోకి అనుమతించడంలేదు. జిల్లాకేంద్రంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద దాదాపు 20మంది ఆర్టీఏ ఏజెంట్లు ఉన్నారు. కోదాడలో ఎంవీఐ కార్యాలయం వద్ద 15 మందిదాకా ఏజెంట్లు ఉన్నారు. నిన్నటివరకు అన్ని పనులు చక్కబెట్టిన ఏజెంట్లు లేకపోవడంతో వారితో పనులు చేయించుకోవడం అలవాటైన ప్రజలకూ ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా చదువురాని గ్రామీణులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల కోసం మీసేవా కేంద్రాల్లో ఫీజు చెల్లించాలి. అంతేకాక కొన్ని ఫాంలు సొంతంగా నింపాలి. ఇవి నింపడం వారికి మామూలు వారికి ఇబ్బందిగానే ఉంటుంది. నేరుగా కార్యాలయానికి వెళితే అవి అవీ లేవంటూ కొర్రీలు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఏజెంట్లు ఉంటే అంతోఇంతో తీసుకొని వారే అన్ని పనులు చేసిపెట్టేవారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం దళారీవ్యవస్థ లేకుండా చేయాలన్న చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో కొంతమేర ఫలితాలు కనిపిస్తున్నా దొడ్డిదారిన మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వాహనదారుల నుంచి వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆర్టీఏ ఏజెంట్లకు ఉపాధి కరువై జీవనం ఇబ్బందిగా మారింది.

**మూడు నెలల్లో రూ.30 కోట్లు**

రవాణా శాఖకు ఈ ఆర్థికసంవత్సరం(20245-26)వరకు రూ.120కోట్ల రెవెన్యూ లక్ష్యాన్ని ప్రభుత్వం విధించింది. జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో ఎక్కువగా లారీలు, ట్రాక్టర్ల ద్వారా రెవెన్యూ వస్తుండగా, కోదాడ ఎంవీఐలో పరిసర ప్రాంతాల్లో సిమెంట్ పరిశ్రమలు ఉండడంతో లారీల రిజిస్ట్రేషన్ ద్వారా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఇప్పటికే దాదాపు రూ.30 కోట్ల వరకు ఆదాయం లభించినట్లు తెలుస్తోంది. ఈ నెల ఆషాఢమాసం కావడంతో వాహనాల కొనుగోళ్లు తగ్గాయి. దీంతో రిజిస్ట్రేషన్లు కూడా సన్నగిల్లాయి. ఇదిలా ఉండగా అనుకున్న మేరకు ఆదాయం లేకపోతే రవాణాశాఖ అధికారులు తనిఖీల బాటపడుతారు. కార్లు, బస్సులు, లారీలు, పెద్దపెద్ద ట్రక్కులు, హార్వేస్టర్ల వంటి వాటిని తనిఖీచేస్తారు. రిజిస్ట్రేషన్లు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేకపోతే జరిమానాలు విధిస్తారు. సాధారణంగా ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, బస్సులు, లారీలు, మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు ప్రతి రెండేళ్లకు ఒకసారి ఫిట్‌నెస్ చేయించాలి.

కొనుగోలు చేసి న తర్వాత ఏడేళ్లు దాటితే ప్రతి ఏడాది ఫిట్‌నెస్ చేయించాలి. కేవలం జూన్‌లోనే అంబులెన్స్ ఒకటి రిజిస్ట్రేషన్ కాగా ఆటోలు 63, కార్లు 71, మోటార్ సైకిళ్లు 733, బస్సులు 38, ట్రాక్టర్లు 178, ట్రాక్టర్ ట్రైలర్స్ 100, హార్వెస్టర్ 1, స్టేజీ క్యారేజీబస్సులు రెండు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి బాగానే ఆదాయం వచ్చింది. జూన్‌లో హెవీమోటార్ వెహికిల్ లైసెన్సులు 31, లైట్ మోటార్ వెహికిల్స్ లైసెన్సులు 536, మోటార్ సైకిల్ లైసెన్స్‌లు 552, ట్రాక్టర్ లైసెన్స్‌లు 118, ఇతర వాహనాలకు లైసెన్స్‌లు 114 పొందారు.

**ఏజెంట్లను అనుమతించడం లేదు**



ప్రభుత్వం నిబంధనల మేరకు ఆర్టీఏ ఏజెంట్లను కార్యాలయంలోకి అనుమతించడంలేదు. అన్ని ఫాంలు సరిగా ఉంటే వెంటనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. నేరుగా వస్తే కొర్రీలు పెడుతున్నారనేది అవాస్తవం.

- జి సురేష్‌రెడ్డి, డీటీవో

# 'కార్పొరేట్'కు అనుకూలంగా కేంద్రం పాలన

సూర్యాపేటటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల పాలన సాగిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రజాసంఘాల పోరాటవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా నిధులు కేటాయించి, సామాజిక సంక్షేమానికి కోతలు విధించిదన్నారు. సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ సంస్థలకు పెట్టుబడిదారులకు రూ. 5వేల కోట్ల రాయితీ ప్రకటించిందని మండిపడ్డారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కార్మిక వర్గం ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కార్మికులకు ఇస్తానన్న ఏడాదికి రూ.12వేలు నేటికి అమలు కావడంలేదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై ఆంక్షలు విధిస్తుంటే ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వతేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జునరెడ్డి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోటగోపి, ఏకలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం


# గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలి

మద్దిరాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూతగాదాలు, ఇళ్ల వివాదాలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూర్యాపేట జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ పర్వీన్‌కౌసర్, తుంగతుర్తి జడ్జి గౌస్‌పాషా అన్నారు. మండలంలో ని చిననెమిల, గుట్టకాడి తండా గ్రామా ల్లో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. గ్రామాల్లో రైతుల భూతగాదాలు, సరిహద్దు సమస్యలు, భూముల వద్దకు వెళ్లే దారి, అర్హత ఉండి పింఛన్ రాని వారు వినతిపత్రాలు అందజేస్తే కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. అందరూ కలిసి మెలసి ఉండాలన్నారు. సమావేశంలో సీఐ నర్సింహారావు, ఎస్ఐ వీరన్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ పర్వీన్‌కౌసర్

# విద్యుత్ వినియోగంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి



సూర్యాపేటక్రైం, జూలై 3, (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్‌ను వినియోగించే సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సూచించారు గురువారం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, మోటార్ల వద్ద విద్యుత్ సరఫరా అయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు. పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూముల వద్ద రైతులు, పశువులు విద్యుదాఘాతంతో మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి విద్యుత్ ఉద్యోగులు సేవలు ఉపయోగించుకోవాలన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్**

పెన్‌పహడ్, జూలై 3(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. ఆసుపత్రి అపరిశుభ్రంగా ఉండడంతో మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔషధ నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆశావర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గర్భిణులు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలపై, వైద్యాధికారి, ఏఎన్‌ఎంల మధ్య వివాదాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఔషధ నిల్వల రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

# కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఈ నెల 14న తిరుమలగిరిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ సన్నాహక సమావేశం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా దివాళా తీయించారన్నారు. ఈ నెల 14న తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సీఎం సభకు పెద్దఎత్తున అన్ని గ్రామాల నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహా, సింగిల్ విండో చైర్మన్ తాల్లూరి మురళి, జిల్లా కార్యదర్శి గూని వెంకటయ్య, నాయకులు వేముల గోపినాథ్, నోముల రవి కుమార్, బొల్లికొండ గణేష్, బోడ అరుణ్ కుమార్, షేక్ ఇబ్రహీం, బందెల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిధులతోనే చండూరులో పనులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

చండూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : చండూరు పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులేనని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా చండూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఒక్కరూపాయి అభివృద్ధి జరగలేదన్నారు. ఆ పార్టీ వారి అవినీతిని ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు పెడుతోందని, తాజాగా చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ ఇల్లు కూల్చి వేశారన్నారు. తమ కార్యకర్తలపై అక్రమకేసులు బనాయించి ఓట్లు వేయించుకుందామని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అరాచకాలకు అడ్డులేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం, రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్, పెదగోని వెంకన్న, కురుపాటి సుదర్శన్, తేలుకుంట్ల చంద్రశేఖర్, తేలుకుంట్ల జానయ్య పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రాచరిక, రాక్షసపాలన



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రాచరిక, రాక్షస పాలన కొనసాగుతోందని, ప్రశ్నించేవారిపై కేసులు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్‌వ్యవస్థను ఉపయోగించి గ్రామాల్లో ప్రశ్నించిన నాయకులపై కేసులు పెడుతూ కాంగ్రెస్ నాయకులు భయాందోళనకు గురిచేస్తున్నారు. తాము ఉద్యమం నుంచి వచ్చామని, ఇవి కొత్తేమి కాదని, ఎలాంటి కేసులకైనా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇక నుంచి ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అయితగోని వెంకన్నగౌడ్, మాజీ అధ్యక్షులు కట్టా వెంకటరెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజలాల్ శేఖర్ బాబు, దుబ్బ వెంకన్న, జేరిపోతుల చంద్రమౌళి, అక్కినేపల్లి శ్రీరాములు, భూపతి ఉపేందర్, శేషరాజపల్లి వెంకన్న, పాక రాములు, మహేశ్వరం వెంకన్న, గుండ్ల వెంకన్న, చివుట సైదులు, రాపాక రాజు, నిమ్మల సురేష్, తీగల వెంకన్న, రాచకొండ గణేష్, కమలాకర్, చీమల శ్రవణ్ కుమార్, నోముల శ్రీనివాస్, చింతల శంకర్, జలందర్, బడేసాబ్ తదితరులు ఉన్నారు.



# చేనేత రుణమాఫీ!

**రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు శుభవార్త అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రుణమాఫీని అమలుచేస్తూ, ఈ పథకం కోసం రూ.33 కోట్లు విడుదల చేసింది. దీంతో చేనేత కార్మికులకు గొప్ప ఆర్థిక ఊరట లభించింది. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న కార్మికులందరికీ లబ్ధి చేకూరనుంది. రాష్ట్రవాప్తంగా 6,600 మంది చేనేత కార్మికులు ప్రయోజనం పొందుతుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.**

● ప్రస్తుతం రూ.లక్ష లోపు రుణాలకే ● రూ.33 కోట్లు మంజూరు ● ఉమ్మడి జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం ● కార్మికుల్లో ఆనందోత్సాహాలు



(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

చేనేత కార్మికులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. కార్మికులను రుణవిముక్తులను చేస్తూ 2025-26 బడ్జెట్ నుంచి రూ.33కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలకే మాఫీ వర్తిస్తుంది. చేనేత వృత్తిపై తీసుకున్న రుణాలు, చేనేత వస్త్రాల ఉత్పత్తికి, వృత్తి సంబంధ కార్యకలాపాలు, ముద్ర రుణాలన్నింటికీ మాఫీ కానున్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఆయా బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 1,162 మంది చేనేత కార్మికులకు రూ.8.04 కోట్ల రుణమాఫీ జరుగనుంది. వీరితోపాటు మరో 1,560 మంది రూ.లక్షకు పైగా రుణాలు తీసుకున్నారు. వీరికి సైతం రూ.15.60 కోట్లు రుణమాఫీ వర్తించనుంది. యాదాద్రి-భువనగిరి జిల్లాలో మొత్తం 2,722 మంది కార్మికులకు రూ.23.64కోట్ల రుణవిముక్తి లభించనుంది. అయితే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి మొత్తం 604 మంది చేనేత కార్మికులకు రూ.3.04 కోట్ల రుణమాఫీ కానుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,326 మంది చేనేత కార్మికులకు రూ.26.68 కోట్ల రుణమాఫీ జరుగనుంది.

**చేనేత రుణమాఫీపై సర్కారు తిరకాసు!**

చేనేత రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తిరకాసు పెడుతోంది. అసలుకే మాఫీ చేసి, మిత్తికి మంగళం పాడేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు చేనేత రుణమాఫీపై జరుగుతున్న కసరత్తులో ఈ విషయం వెల్లడైంది. దీంతో రూ.లక్ష లోపు రుణాలు పొందిన చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల నుంచి పొందిన రుణంలో అసలు రూ.లక్ష వరకు మాత్రమే మాఫీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు సమాచారం. అసలుపై పెరిగిన వడ్డీని రుణగ్రహీత తిరిగి బ్యాంకులకు చెల్లిస్తేనే రుణం పొందిన అసలు సొమ్ము మాఫీ జరుగుతుందని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఉదాహరణకు ఒక కార్మికుడు బ్యాంకు నుంచి రూ.90వేలు రుణం తీసుకుంటే దానికి వడ్డీ రూ.25 వేలు అయింది. అసలు వడ్డీ కలిపితే రూ.1.15 లక్షలు అవుతుంది. అయితే బ్యాంకు నుంచి పొందిన రుణం రూ.90వేలకు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని సమాచారం. వీడ్డ మొత్తం రూ.25వేలు కార్మికుడు చెల్లించాల్సి ఉంటుంది. మిగతావారికి కూడా అసలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుండగా, వడ్డీ కార్మికులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏదేమైనా ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేయడంపై కార్మికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నేరుగా ఖాతాల్లోనే జమవుతాయి**



రూ.లక్షలోపు ఉన్న రుణాలున్న వారందరికీ రుణమాఫీ అవుతుంది. రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్న రుణమొత్తాన్ని చెల్లిస్తే వారికి రుణమాఫీ వర్తిస్తుంది. రూ.లక్షలోపు రుణం ఉన్నవారికి గడువులో చెల్లించిన వారికి ప్రయోజనకరం. రుణమాఫీ డబ్బులు నేరుగా చేనేత కార్మికుల ఖాతాలో జమవుతాయి.

శ్రీనివాస్‌రావు, చేనేత, జౌళిశాఖ ఏడీ, యాదాద్రిజిల్లా

**రుణవిముక్తి కలగనుంది**



మూడేళ్ల క్రితం కెనరాబ్యాంకులో రూ.2లక్షలు రుణం తీసుకున్నా. గతేడాది వరకు కిస్తులు కట్టా. ప్రస్తుతం అసలు, వడ్డీ కలుపుకుని రూ.1.90 లక్షల రుణం ఉంది. అయితే రూ.లక్ష మాఫీ చేస్తే రుణవిముక్తి కలుగుతుంది. నాలాగే కార్మికులను రుణవిముక్తులను చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

బోగ గణేష్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

# రాజుకు ఇల్లు మంజూరు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
● ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్న ఆశతో ఉన్న ఇంటిని కూల్చుకున్న నల్లగొండ శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బట్ట రాజుకు ఎమ్మెల్యే మందుల సామేల్ ఇల్లు మంజూరు చేశారు. కమ్యూనిటీ హాల్‌లో ఉంటున్న రాజు దీనస్థితిపై ఈ నెల 3న ఆంధ్రజ్యోతి పత్రికలో మాటలు నమ్మి, గూడూ తీసేశాడు శీర్షికన కథనం ప్రచురితమైంది. గురువారం శాలిగౌరారంలో ఓ సభకు హాజరైన ఎమ్మెల్యే ఈ కథనాన్ని చదివి రాజుకు ఇల్లు చేయాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మిని ఫోన్‌లో ఆదేశించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపించాలన్నారు. వెంటనే రాజు కుటుంబ సభ్యులు ఎంపీడీవో జ్యోతిలక్ష్మి వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలను తెలిపారు.

**'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన రాజు**

తన కుటుంబ సభ్యుల బాధను వెలుగులోకి తీసుకువచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కారణమైన 'ఆంధ్రజ్యోతి'కి రాజుతో పాటు భార్య రమణ, కుమార్తెలు నాగశ్రీ, భవ్యశ్రీలు కృతజ్ఞతలు తెలిపారు.

# 10న బుద్ధవనంలో ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవం



బుద్ధవనంలో ఏర్పాటుచేసిన శిష్యులకు బోధనలు చేస్తున్న బుద్ధుడి శిల్పాలు

నాగార్జునసాగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో ఈ నెల 10న గురుపౌర్ణమి సందర్భంగా ధర్మప్రవర్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం ముఖ్యఉద్దేశం సిద్ధార్థుడు మొదటిజ్ఞానోదయ సందేశ రోజు అన్నారు. తాను నేర్చుకున్న సత్యాన్ని మొదటిసారిగా శిష్యులైన కొండన్న, మహానామా, వప్పా అస్సాజీ, బాధియాలకు మధ్యప్రదేశ్ రాష్ట్రం సారనాథ్ జింకల వనంలో తెలియజేసిన(ఉపన్యసించిన) రోజు బుద్ధుడి జీవితంలో ముఖ్యమైన ఐదు ఘట్టాలల్లో ఒకటన్నారు. బుద్ధుని మొదటి ఉపన్యాసాన్ని ధర్యచక్ర ప్రవర్తన దినోత్సవంగా బౌద్ధులు నిర్వహించుకుంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 10న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

# వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో యాదాద్రిభువనగిరి జిల్లాలో కూలి, సూర్యాపేటలో ఎలక్ట్రీషియన్, నల్లగొండ జిల్లాలో రైతు ఉన్నారు.**

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఏగూరి సుధాకర్(30) గాంధీఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం ఎగూరి స్వరూప కుటుంబం సుమారు 20 ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం మండలంలోని సదర్శాపురం నుంచి మోత్కూరు వచ్చి ఇక్కడే నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్దకుమారుడు హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. స్వరూప ఇళ్లలో పనిచేస్తుండగా చిన్నకుమారుడు సుధాకర్ బ్యాండ్ మేళం వాయించేవాడు. జూన్ 27న సుధాకర్ క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

**విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ ...**



బిచ్చానాయక్(ఫైల్)

పాలకవీడు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ గురువారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సైదులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సఫావత్ బిచ్చా నాయక్(45) మీగడంపాడుతండాలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగుస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రూపావత్ కోట్యా పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు సరిచేసేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బిచ్చానాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కస్తూరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారని ఏఎస్ఐ సైదులు తెలిపారు.


**నేరడలో మూర్ఛతో ఊపిరాడక రైతు..**



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

చిట్యాల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వచ్చిన వ్యక్తి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలో గురువారం జరిగింది. ఎస్ఐ మామిడి రాములు తెలిపిన వివరాల ప్రకారం నేరడకు చెందిన వడ్డెపల్లి సైదులు(40) వ్యవసాయం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. రోజువారీగా పొలంలో పనులు చేస్తూ మూర్ఛతో కిందపడిపోయాడు. పొలంలో ఉన్న బూడిదలో పడిపోగా ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్లిన రైతులు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. సైదులు భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ ఘట్టం

యాదగిరిగుట్ట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను అలంకరించి గజవాహనసేవ చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి కల్యాణతంతు కొనసాగించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో నిత్యపూజలు, యాగశాలలో నిత్యరుద్రహవనం జరిపించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,95,642 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.

# చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి జైలు

కోదాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అప్పు కింద చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కోదాడ ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడకు చెందిన కొదుమూరి ప్రవీణ్ నుండి రంగాపురపు ఉమామహేశ్వర్ తన అవసరాల నిమిత్తం అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని ప్రవీణ్ కోరగా ఉమామహేశ్వర్ 2014లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంక్‌లో చెల్లకపోవడంతో ప్రవీణ్ కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణల అనంతరం కేసును విచారించిన ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ భవ్య గురువారం తీర్పు వెలువరించారు. ఇచ్చిన చెక్కు తాలూకా రూ.5లక్షలు ఇవ్వాలని, చెల్లని చెక్కు ఇచ్చినందుకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న సూర్యాపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తేలిందన్నారు. వారిని గురువారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగిలిన ఐదుగురికి రూ.6500 జరిమానా విధించినట్లు తెలిపారు.

## దాడి కేసులో నిందితులకు జరిమానా

నిడమనూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైజన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం 2016 ఆగస్టు 31న మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన గుడిపాటి లక్ష్మమ్మ తన పశువులకు గడ్డి కోసేందుకు పొలం వద్దకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన గుడిపాటి నవీన్, గుడిపాటి సైదయ్య, గుడిపాటి వెంకమ్మ అనే ముగ్గురు పొలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా గెట్టు పంచాయితీని దృష్టిలో పెట్టుకొని దుర్భాషలాడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ యాలాద్రి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించనిపక్షంలో నిందితులు నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ సైదులు కేసు విచారణకు సహకరించారని లైజన్ అధికారి తెలిపారు.

# భూతగాదాల్లో ఘర్షణ, ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో భరత్

పెన్‌పహాడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల కుటుంబాల మధ్య భూవివాదం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఎస్ఐ గోపీకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం భక్కాయిగూడెం గ్రామానికి చెందిన శానం వెంకటేశ్వర్లు, రామలింగయ్య అన్నదమ్ములు. వారికి పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. తరచూ సరిహద్దు వివాదాలు జరుగుతున్నాయి. పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టినా వివాదం సమసిపోలేదు. గురువారం రామలింగయ్య కుమారుడు భరత్, భార్య కళమ్మ, శానం వెంకటేశ్వర్లు, ఆయన కుమారులు నాగేంద్రబాబు, లక్ష్మణ్‌రావులు పొలం గెట్ల వద్ద ఘర్షణపడ్డారు. ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో భరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శానం వెంకటేశ్వర్లు కుమారులు నాగేంద్రబాబు, లక్ష్మణ్‌రావులు నల్లగొండ 12వబెటాలియన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భరత్ తల్లి కళమ్మ ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

# అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

| జిల్లాలో... | |
|---|---|
| కేంద్రాలు | 901 |
| బాలింతలు | 3,429 |
| గర్భిణులు | 4,511 |
| ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు | 21,890 |
| 3-6 ఏళ్ల చిన్నారులు | 19,535 |

హాజరు తప్పనిసరి చేశారు. దీంతో కేంద్రాలకు ఎంత మంది వచ్చారో సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీసి కార్యకర్తలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

**కేంద్రాల్లో కొనసాగుతున్న ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ**

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుంది. జిల్లాలో మొత్తం 901 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, మొత్తం 49,365 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఆరు నెలల నుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు 70నుంచి 80శాతం వరకు ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ పూర్తయింది. గర్భిణులు, బాలింత మహిళలకు పోషన్ ట్రాకర్ అప్లికేషన్‌లో ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుంది. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. మరి కొన్ని రోజుల్లో ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా లబ్ధిదారులకు ఆహారం అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

**యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరుస్తాం**



ఎఫ్ఆర్ఎస్ ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల ఆదేశాలతో లబ్ధిదారుల ఫొటోలను క్యాప్చర్ చేసి వారి ఆధార్‌తో లింక్ చేస్తున్నాం. ఈకేవైసీతోపాటు లబ్ధిదారులకు అందిస్తున్న ఆహారపు వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో పొందుపరుస్తున్నాం.

పి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, బీబీనగర్



సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోన్లు

# గురుకులాల్లో ఫోన్‌మిత్ర

(5వ పేజీ తరువాయి)

కూడా ఫోన్‌లో విషయాలను తెలిపే అవకాశం కల్పించారు.

**విద్యార్థులకు తొలగనున్న ఇంటిబెంగ**

గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసి ఫోన్‌మిత్ర ద్వారా విద్యార్థుల్లో ఉండే ఇంటిబెంగ తొలగిపోతుంది. చాలా మంది విద్యార్థులు ఇంటి మీద బెంగపెట్టుకుని విద్యపై సరిగా దృష్టి సారించలేక ఇబ్బందులు పడుతుంటారు. అదే విధంగా మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులతో దూరంగా ఉన్నామనే భావన ఉంటుంది. ఇంకా కొంత మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఫోన్‌మిత్ర ద్వారా ఇలాంటి సమస్యలకు చెక్‌పడనుంది. వారి తల్లిదండ్రులతో రోజూ మాట్లాడుతుండడం వల్ల మానసికంగా బాగుంటారు. అంతేగాక ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. దీంతో పాటు విద్యార్థుల డ్రాపవుట్స్ కూడా తగ్గనున్నాయి.

**'ఫోన్‌మిత్ర' విద్యార్థులకు ఉపయోగకరం**



గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఫోన్‌మిత్ర కార్యక్రమం విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. విద్యార్థినులు రోజువారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుకోవడంతో ఎలాంటి ఇబ్బందులకు గురికావడం లేదు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకుంటున్నారు. ఫోన్‌మిత్ర ద్వారా ఇంటిమీద బెంగపోయింది. విద్యార్థినులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటున్నారు. దీంతో విద్యపై దృష్టి సారిస్తున్నారు.

సీహెచ్.పద్మ, ప్రిన్సిపాల్, బాలికల గురుకుల కళాశాల దురాజ్‌పల్లి, సూర్యాపేట













WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111



## అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను పర్మినెంట్ చేయాలి

సూర్యాపేటఅర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటిగురూజీ అన్నారు. ఈ నెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయంలో సమ్మె నోటీసును కార్యాలయ సిబ్బంది శోభకు అందజేసి మాట్లాడారు.



## ప్రకృతి వ్యవసాయ రైతుల పొలాల్లో మట్టి నమూనాల సేకరణ

మునగాల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే ప్రకృతి వ్యవసాయం పథకంలో భాగంగా గురువారం మండలంలోని ముకుందాపురం, బరాఖత్‌గూడెం గ్రామాల్లో 125మంది రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించినట్లు మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయం, సాగు పద్ధతులు, మెళకువలపై కేవీకే గడ్డిపల్లిలో రెండుసార్లు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

**పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి**

కోదాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించి ఆర్డీవోకి వినతిప్రతం అందజేశారు. విద్యార్థులకు రావాల్సిన రూ.7200కోట్లు విడుదల చేయకుండా, అందాల పోటీలకు ఖర్చు చేయడానికి రూ.200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కామల్ల ఉదయ్, పులి రాఖి, జిల్లా నాయకులు డి.వేణు, పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు గుండు ఉమేష్, బి.యశ్వంత్, నూనె కల్యాణ్, రాము, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కోదాడలో ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

### స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి

హుజూర్‌నగర్: విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు కోరారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ మంజూరుచేసి పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయి, గోపి, రాము, వెంకన్న, నాగు, రాజేందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలను అన్నివిధాల ఆదుకుంటా



సూర్యాపేట ఆసుపత్రిలో శ్రీమన్నారాయణ సతీమణికి రూ.1.50లక్షలు అందిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి, జూలై 3(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త కట్టెకోల శ్రీమన్నారాయణను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీమన్నారాయణను పరామర్శించి ఆయన కుటుంబానికి రూ.1.50లక్షలు ఆర్థికసాయం అందించారు. వైద్యులతో మాట్లాడి శ్రీమన్నారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, వెలుగు వెంకన్నగౌడ్, దేవేందర్, పిల్లల రమేష్‌నాయుడు, కృష్ణ, సైదిరెడ్డి, అంజయ్య, బాణాల వెంకన్న, తదితరులు ఉన్నారు.

## సమాచారం

### బీజేపీని బలోపేతం చేయాలి

హుజూర్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కొండా హరీష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉమామహేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నారపరాజు రామచందర్‌రావు ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, నాగేందర్, హరీష్, సతీష్, బల్వంత్‌సింగ్ పాల్గొన్నారు.

### అధికారులకు ప్రజలు సహకరించాలి

చింతలపాలెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రజలు సంబంధిత పత్రాలను అధికారులు అందజేసి సహకరించాలని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెం మండలం రెబల్లె, నెమలిపురిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) ఆత్రేయతో కలిసి అవసరమైన పత్రాలను దరఖాస్తుదారుల నుంచి స్వీకరించి, భూమి స్థితిగతులను పరిశీలించారు. నెమలిపురి గ్రామం నుంచి మూడు దరఖాస్తులు రాగా, ఒక దరఖాస్తును పరిష్కరించారు. అదేవిధంగా రెబల్లె గ్రామం నుంచి 18 దరఖాస్తులు రాగా, ఒక దరఖాస్తును పరిశీలించారు. మిగిలిన వారికి భూమి తమదని రుజువు చేసే పత్రాలు తెచ్చుకోవాలని దరఖాస్తుదారులకు సూచించారు.

### 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి

కోదాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్లో ప్రవేశించడానికి ఈ నెల 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోదాడ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ డి.మార్కండేయ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతిలో ప్రవేశానికి రూ.1550, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు రూ.1800లు ఫీజు చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉమెన్ క్యాటగిరి విద్యార్థులకు ఫీజులో రాయితీలు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కోదాడలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఫోన్ నెం.9912451123ను సంప్రదించాలన్నారు.

### ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలి

ఆత్మకూర్(ఎస్), జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచి మెరుగైన విద్యనందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) భానునాయక్ అన్నారు. గురువారం మండలంలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది 30శాతం అడ్మిషన్లను పెంచే బాధ్యతను అధ్యాపకులు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్, లైబ్రరీ, రీడింగ్ రూమ్స్, తరగతి గదులు, ఫర్నీచర్ అందుబాటులో ఉంచామని, ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని అన్నారు. ఈ. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గునగంటి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### కళాకారుల సోషల్ మీడియా కన్వీనర్ నియామకం

నూతనకల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని ఎర్రపహడ్ గ్రామానికి చెందిన ఇరుగు వెంకన్నను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరిరేకంటి కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి చిరంజీవి, కృష్ణయ్య, లింగయ్య, వెంకటమ్మ, శ్రీను, శాంతి తదితరులు ఉన్నారు.

### శ్రీసంతోషిమాత దేవాలయంలో వారాహి పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

సూర్యాపేట అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసంలో విశేషమైన శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసంతోషిమాత దేవాలయంలో గురువారం ఉన్మత్త వారాహి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు భట్టారం వంశీకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మహిళలు హారతి ఇస్తూ అమ్మవారిని పూజించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేషంగుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండపల్లి మురళీధర్, సభ్యులు బజ్జూరి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలి



సూర్యాపేటలో జూట్ బ్యాగులు అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి

సూర్యాపేట టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నివారణ దినం పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని 29వ వార్డులో క్లాత్ సంచులను పంపిణీ చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయంగా క్లాత్ సంచులను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, శివప్రసాద్, శ్వేత, యాదగిరి, వెంకటేశ్వర్లు, వేణు, ఆర్పీలు, గ్రీన్ క్లబ్ ట్రస్టు అధ్యక్షుడు ముప్పారపు నరేందర్, నల్లపాటి మమత శ్రీకాంత్, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతకు అందరూ కృషి చేయాలి

హుజూర్‌నగర్: పరిశుభ్రతకు అందరూ కృషిచేయాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి కోరారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలో మునిసిపల్ ప్రజలకు అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా మునిసిపల్ కార్మికులకు అందించాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మెరిగ అశోక్, సులువ చంద్రశేఖర్, శివశంకర్, సతీష్, సత్యనారాయణ, మహేష్, నాగలక్ష్మి, సీతమ్మ, మౌనిక, లక్ష్మి, భారతమ్మ, పుష్పావతి పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, మునిసిపాలిటీ ఉద్యోగులు

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుల ఎన్నిక



సూరిబాబు

చిలుకూరు, గరిడేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మల్లెపంగు సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. వరుసగా మరోసారి తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● గరిడేపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి రవి ఏకగ్రీవంగా ఎన్నుకన్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు చింత వినయ్ బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జెండా ఈ నెల ఏడో తేదీన ప్రతి గ్రామంలో ఎగరాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి రవి, ఉపాధ్యక్షుడిగా దూర వినోద్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, పోలె శ్రీకాంత్, మందశేఖర్, కుర్రిభిక్షం, కడప వీరస్వామి, ఆలంపల్లి శేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల సుధాకర్, కుర్రివెంకన్న, ఏపూరి రాజు, బి.వెంకటేశ్వర్లు, వెంకన్న, బరిగెల విజయ్, రాజు, మల్లయ్య, అరుణ్, వెంకటేష్, సాయి కిరణ్, శివ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## టెండర్లపై విమర్శలు చేయడం సరికాదు

హుజూర్‌నగర్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ధాన్యం టెండర్లపై విమర్శలు చేయడం సరికాదని మిల్లర్ల సంఘం రాష్ట్ర నాయకులు గజ్జి ప్రభాకర్, పొలిశెట్టి నర్సింహారావు అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనే టెండర్ల ప్రక్రియ జరిగిందన్నారు. గత టెండర్లలో నష్టం జరుగుతుందని భావించి నేటి ప్రభుత్వం మళ్లీ టెండర్లకు పిలిచిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు కొత్త టెండర్లలో ఎక్కువ ఆదాయం వచ్చిందన్నారు. నూతన టెండర్ల ప్రకారం సీఎంఆర్ ధాన్యం ఎత్తినట్లు తెలిపారు. కొత్త టెండర్లలో అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో పట్టణ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, గెల్లి అప్పారావు, వెంకటనారాయణ, శ్రీరామ్, అనిల్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పీఏసీఎస్ సీఈవోపై దాడి హేయమైన చర్య

అర్వపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం పీఏసీఎస్ సీఈవోపై దాడి చేయడం హేయమైన చర్య అని పీఏసీఎస్ చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, వైస్ చైర్మన్ కొణతం స్టాలిన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపురం పీఏసీఎస్ కార్యాలయంలో రైతులు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల ఒకటో తేదీన పీఏసీఎస్ సీఈవో పూర సత్యనారాయణ, సిబ్బంది ఎల్గూరి వెంకన్న రైతులకు ఎరువులు పంపిణీ చేస్తుండగా, వీరిద్దరిపై ఇందుర్తి జితేందర్‌రెడ్డి వర్గీయులు దాడి చేసి గాయపర్చారని తెలిపారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, దాడి చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సీఈవో సత్యనారాయణ, పీఏసీఎస్ సభ్యులు చల్లా వేణుధర్‌రెడ్డి, మంగదొడ్ల మల్లయ్య, బొల్లం సుజాత, కృష్ణయ్య, జ్యోతుల రాంబాయమ్మ, సందీప్, ఎడ్ల అమరేందర్‌రావు, బొడ్డు బొందమ్మ, జ్యోతుల నాగయ్య, సత్యనారాయణ, మధుసూదన్, పాలెల్లి శ్రీను, చామకూరి లక్ష్మయ్య, జీడి స్వామి, జీడి నర్సయ్య పాల్గొన్నారు.

## ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి





చిలుకూరులో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణ

చిలుకూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గ్రామాల్లో బీఎల్వోలు తప్పులు లేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆర్డీవో సూర్యనారాయణ సూచించారు. గురువారం మండల కేంద్రంలో బీఎల్వోలతో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, డీటీ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ పుష్ప, ఆర్ఐలు సీతారామచందర్‌రావు, శ్వేత, ఆర్పీ చందా శ్రీనివాస్, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ˇండల వ్యవసాయ విస్తరణాధికారులు రేష్మ, నాగు, రమ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ డిపో నుంచి ప్రత్యేక టూర్ ప్యాకేజీలు

కోదాడ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కోదాడ డిపో నుంచి పలు ఆధ్యాత్మిక క్షేత్రాలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ బిశ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరం-ద్వారకా తిరుమల యాత్రలో భాగంగా అన్నవరం, ద్రాక్షారామం, అంతర్వేది, పెనుగొండ, ర్యాలీ, ద్వారకాతిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాలను దర్శించడం జరుగుతుందన్నారు. ఈ నెల 4, 11 తేదీల్లో బస్సులు అందుబాటులో ఉన్నాయని, పెద్దలకు రూ. 2 వేలు, పిల్లలకు రూ. 1200 చార్జీ ఉంటుందన్నారు. ధర్మపురి యాత్రలో భాగంగా ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, కొమురవెల్లి, భద్రకాళి మందిరాలను దర్శించడం జరుగుతుందన్నారు. ఈ బస్సులు ఈ నెల 4, 11 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరుతాయని, పెద్దలకు రూ.1,800లు, పిల్లలకు రూ.1000 చార్జీ ఉంటుందన్నారు. అదేవిధంగా అరుణాచలం-గిరిప్రదక్షణ యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, గిరి ప్రదిక్షణ ఉంటుందన్నారు. ఈ బస్సు ఈ నెల 8న రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందని, పెద్దలకు రూ.4వేలు, పిల్లలకు రూ. 2,200 చార్జీ ఉంటుందన్నారు. గుల్బర్గా యాత్రలో భాగంగా ఖాజాబంధా నవాజ్ దర్గా, గుల్బర్గా, హల్కట్ట షరీఫ్ దర్గాలను దర్శిస్తారని అన్నారు. ఈ బస్సు ఈ నెల 10న రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందని, పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1,200 చార్జీ ఉంటుందని తెలిపారుసీటు రిజర్వేషన్ కోసం 9573953143, 7780433533, 9959226302 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## తెలంగాణ మలి దశ ఉద్యమకారుల దీక్ష రేపు

నూతనకల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల ఐదో తేదీన నిర్వహించే తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఉద్యమకారుల దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకుడు గడ్డం యాదగిరి కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందున గన్‌పార్కు అమర వీరుల స్థూపం ఎదుట నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో యాకయ్య, మద్దెల సురేందర్ ఉన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

హుజూర్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, మైనార్టీ నాయకుడు షేక్ సైదా అన్నారు. గురువారం పట్టణంలో మొహ్రం వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా నిర్వహించుకునే మొహ్రం వేడుకలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు యోహాన్, వీరబాబు, వీరారెడ్డి, అనీఫ్, గణేష్, మొయిన్, మీరా, బాషా, చాంద్‌మియా పాల్గొన్నారు.

## కామంచి మొక్కల కనువిందు



మూసీ కాల్వలో పెరిగిన కామంచి మొక్కలు

జాజిరెడ్డిగూడెం సమీపంలోని మూసీ వాగులో కామంచి మొక్కలు ఐదు అడుగుల ఎత్తు పెరిగి పూల మొక్కల వలే కనువిందు చేస్తున్నాయి. కామంచి మొక్కలు సహజంగా మూడు అడుగులే పెరుగుతాయి. మూసీ వాగులో ఐదు అడుగుల వరకు పెరగడంతో చూపరులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. కామంచి మొక్కలు వరి పొలాన్ని పోలినట్లు దర్శనమిస్తున్నాయి.

● (ఆంధ్రజ్యోతి - అర్వపల్లి)

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ రాధిక

హుజూర్‌నగర్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికఅరుణ్‌కుమార్ తెలిపారు. గురువారం బూరుగడ్డలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువులను రైతులు సంరక్షించుకోవాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, బలవర్థకమైన మందులు వాడాలన్నారు. పశువైద్యాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీనివాసు, రఘుపతిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకన్న, గని, ప్రవీణ్, బిక్షం, నాగయ్య, సైదులు, వీరబాబు, గోపి, నాగరాజు, సతీష్, మట్టపల్లి, శివ, సైదులు, గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## శుక్రవారం డ్రైడేగా పాటించాలి

నేరేడుచర్ల: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరుతూ గురువారం నేరేడుచర్ల మునిసిపాలిటీలో ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పించారు. వ్యవసాయ సముదాయాలను గుర్తించి యజమాను లతో ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయించారు. 14వ వార్డులోని చింతబండలో నల్లా కనెక్షన్ ఆన్‌లైన్ కాని వాటిని గుర్తించారు. అదేవిధంగా మంచి నీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్యాలయం, వార్డు అధికారులు, సిబ్బంది, మెప్మా, ఆర్పీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వేలం పాట నిర్వహణకు సహకరించాలి

నూతనకల్: మండలంలోని మిర్యాల గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ భూములకు శుక్రవారం నిర్వహించే బహిరంగ కౌలు వేలం పాటకు గ్రామస్థులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దరిపెల్లి వీరన్నతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ అధికారి కుశలయ్య తదితరులు ఉన్నారు.

## ఎన్నికల హామీలను అమలుచేయాలి

హుజూర్‌నగర్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. గురువారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వహించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సాగర్ నీటి విడుదలపై షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అన్నారు. నూతన చట్టాలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్, యల్లావుల రమేష్, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, హుస్సేన్, రమణ, మంగయ్య పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారం చేయడం సరికాదు

హుజూర్‌నగర్‌రూరల్: విద్యను వ్యాపారం చేయడం సరికాదని బీఆర్‌ఎస్ విద్యార్థి సంఘం నాయకులు రాపోలు నవీన్, ఎండీ సోయబ్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. అనంతరం పుస్తకాలను విక్రయిస్తున్న విద్యా సంస్థలను పరిశీలించి మాట్లాడారు. పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలను విక్రయించడం సరికాదన్నారు. వాటిని అధికారులు సీజ్ చేయాలని, పాఠశాలల ఫీజులను నియంత్రించాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్‌సైదులు, వీరాంజనేయులు, శ్రీనివాసు, వినయ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

హుజూర్‌నగర్: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని డీఈ వెంకటకృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని బూరుగడ్డ సబ్‌స్టేషన్, కరక్కాయలగూడెం ఫీడర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్‌లోడ్ దృష్ట్యా సబ్‌స్టేషన్‌లో కొత్తగా రెండు ఫీడర్ పనులను చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని గోపాలపురం, రాయినిగూడెం, కాచవారిగూడెం, ముత్యాలనగర్ గ్రామాలకు ఒక ఫీడర్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ నాగిరెడ్డి, ఏఈ రాంప్రసాద్, దొంగరి సత్యనారాయణ, మచ్చా వెంకటేశ్వర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచిన పింఛన్లు మంజూరుచేయాలి

హుజూర్‌నగర్ రూరల్: దివ్యాంగులకు పెంచిన పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని ఆ సంఘం నాయకుడు ఇందిరాల పిచ్చయ్య కోరారు. గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, శ్రీను, రూపారాణి, నర్సింహారావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకల కరపత్రం ఆవిష్కరణ

కోదాడ రూరల్: మండలంలోని నల్లబండగూడెం గ్రామం సాయిబాబా దేవాలయంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్రా వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, ఏదులాపురం శ్రీనివాసరావు, శరబయ్య, శేషు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలి

హుజూర్‌నగర్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. గురువారం పట్టణంలో మధ్యాహ్న భోజనం, ఆశా కార్యకర్తలు, సమభావన సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాల కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించే సమ్మెలో అందరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, మంగమ్మ, పద్మ, చంద్రకళ, స్వరూప, నాగమణి, ఝాన్సీ పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హుజూర్‌నగర్: యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ చరమందరాజు కోరారు. గురువారం పట్టణంలోని గోవిందాపురంలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడారు. యువత చేతుల్లోనే భవిష్యత్ ఉందన్నారు. విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జూదం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజ శ్రేయస్సు కోసం అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిలకబత్తిని సౌజన్య, ధనుంజయ్, బలరామిరెడ్డి, చిలకబత్తిని శాంత, ధనమ్మ, కోటి, శ్రీనివాసు, వెంకటేశ్వర్లు, నాగరాజు, వీరబాబు, చిట్టెమ్మ, జీవమ్మ, ప్రసాద్, కోటమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.